సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



మన్యం వాతావరణమిలా..


సాక్షి, పాడేరు: జిల్లాలో అరకులోయలో 12, మినుములూరులో 13, చింతపల్లిలో 14.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



సింహగిరిపై విశేష పూజలు

సింహాచలం: సింహగిరిపై సోమవారం ధనుర్మాస పూజల్లో భాగంగా గోదాదేవికి తిరువీధిని వైభవంగా నిర్వహించారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



విశాఖ: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం

విద్యార్థులకు క్షవరం చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు



విద్యార్థులకు క్షవరం చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు బాలాజీ

హుకుంపేట: స్థానిక ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత బాధ్యతను తీసుకున్నారు. జుత్తు బాగా పెరిగిన విద్యార్థులను గుర్తించి ప్రతీ ఆదివారం పది మందికి తానే స్వయంగా క్షవరం చేస్తున్నారు. దీనివల్ల విద్యార్థుల ఎదుగుదల, ఆలోచన విధానం ఆరోగ్యకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



వై.రామవరం సరిహద్దు ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

వై.రామవరం: మండల కేంద్రంలో వారపు సంత సందర్భంగా సోమవారం అడిషనల్ ఎస్‌ఐ కె. రాంబాబు ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానితుల వివరాలు సేకరించి విడిచిపెట్టారు. సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ ఆదనపు బలగాలు తనిఖీల్లో పాల్గొన్నాయి.

మహిళా కళాశాలకు అవార్డుల పంట



ఆర్‌జేడీ హోదాలో గౌరవ పురస్కారం అందుకుంటున్న ప్రిన్సిపాల్ శోభారాణి

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల రాష్ట్ర స్థాయిలో 8 అవార్డులు కైవసం చేసుకుంది. అనంతపురంలో ఈ నెల 16న నిర్వహించిన ప్రజ్ఞ యాన్యువల్ ఫెస్ట్–2023లో కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ సాధించి అవార్డులు సొంతం చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శోభారాణి తెలిపారు. విద్యార్థుల కేటగిరీలో పి.అనూష (బీఎస్సీ) మొదటి స్థానం, కె.పవిత్ర (బీఏ) మూడో స్థానం, ఉత్తమ కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టులో ఆర్ నవ్యశ్రీ (బి.కాం) అవార్డు సాధించగా, రాష్ట్ర స్థాయిలో సీజీపీఏ 3.28 నేక్ ఏ+ గ్రేడ్ సాధించినందుకు కళాశాల ప్రిన్సిపాల్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డి.అరుణపద్మను అవార్డుతో సత్కరించారు. అనంతరం ఇంటర్న్‌షిప్ విభాగంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి, ఇంటర్న్‌షిప్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.హైమావతికి అవార్డులు బహూకరించారు. రాష్ట్రంలో అనుబంధ కళాశాల్లో అత్యధిక అవార్డులు సాధించినందుకు గాను ఆర్‌జేడీ హోదాలో డాక్టర్ ఎస్ శోభారాణిని గౌరవ పురస్కారంతో ప్రత్యేకంగా సత్కరించారు.

పౌష్టికాహారం పంపిణీకి చర్యలు



చిలకలమామిడిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

చింతపల్లి రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె నేపథ్యంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి వెల్లడించారు. సోమవారం ఆమె మండలంలో పర్యటించారు. దీనిలో భాగంగా అంతర్ల, చిల కల మామిడి, రామాలయవీధి అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సంద్భంగా ఆమె మాట్లాడుతూ సమ్మె కారణంగా మూతపడిన ఆయా కేంద్రాలను తెరిపించినట్టు చెప్పారు. పౌష్టికాహారం ఈనెల 22న లబ్ధిదారులకు అందించేలా గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె తెలిపారు.

పొల్లూరుకు మరింత వెలుగు

పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం ఉత్పత్తి సామర్థ్యం పెరగనుంది. ఈ ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం నాలుగు యూనిట్లు సేవలందిస్తుండగా మరో రెండు యూనిట్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇవి అందుబాటులోకి వస్తే విద్యుత్ కారుచౌకగా లభ్యం కానుంది. తద్వారా ప్రభుత్వంపై కొనుగోలు భారం తగ్గుతుందని జెన్‌కో అధికారవర్గాలు తెలిపాయి.

- చురుగ్గా 5,6 యూనిట్లు నిర్మాణ పనులు
- అదనంగా పెరగనున్న 230 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- రూ.536 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం
- రాష్ట్రంలోనే కీలకంగా మారనున్న ప్రాజెక్ట్



సిద్ధం చేస్తున్న పెన్‌స్టాక్ పైపులు



సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో 5,6 యూనిట్లు నిర్మించే ప్రాంతమిదే

రంపచోడవరం/మోతుగూడెం: రాష్ట్రంలో జలవిద్యుత్ ఉత్పత్తిలో ప్రత్యేకత సంతరించుకున్న జిల్లా మరో మైలురాయిని అధిగమించనుంది. రాష్ట్రంలో సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులపై జలవిద్యుత్ కేంద్రాలు ఉన్నప్పటికీ కేవలం నీటి లభ్యత ఆధారంగా ఏడాదిలో మూడు నెలలు మాత్రమే ఉత్పత్తి జరుగుతుంది. జిల్లా విషయానికొస్తే మాచ్‌ఖండ్, సీలేరు, డొంకరాయి, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాలకు పూర్తిస్థాయిలో నీటి లభ్యత ఉన్నందున ఏడాది పొడవునా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. వీటిలో పొల్లూరు జల విద్యుత్ కేంద్రం కీలకపాత్ర పోషిస్తోంది.

ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో..

ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆరు యూనిట్లకు డిజైన్ చేశారు. అయితే వీటిలో నాలుగు మాత్రమే 460 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. వీటిలో ఒకటి, రెండు యూనిట్లను 1975లో రష్యా సాంకేతిక సహకారంతో నిర్మించారు. మూడు, నాలుగు యూనిట్లను 1977లో బీహెచ్‌ఈఎల్ సహకారంతో ఏర్పాటు చేశారు. ఒక్కో యూనిట్ 115 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ప్రస్తుతం నిర్మిస్తున్న ఐదు, ఆరు యూనిట్లు అందుబాటులోకి వస్తే అదనంగా 230 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని జెన్‌కో అధికారవర్గాలు తెలిపాయి.

- పూర్తిస్థాయిలో జల విద్యుత్ జరుగుతున్నప్పటికీ వినియోగం పెరిగి డిమాండ్ ఏర్పడిన సందర్భంలో ప్రభుత్వం విద్యుత్‌ను కొనుగోలు చేస్తోంది. ఐదు, ఆరు యూనిట్ల నిర్మాణ పనులు పూర్తయితే అవసరానికి తగ్గట్టుగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చు. అంతేకాకుండా ప్రభుత్వంపై కొనుగోలు భారం తప్పుతుందని జెన్‌కో అధికారులు చెబుతున్నారు.

పూర్తయిన పైపుల నిర్మాణం

జలవిద్యుత్ కేంద్రంలో అదనపు యూనిట్ల నిర్మాణ పనుల కాంట్రాక్ట్‌ను పొందిన పీఈఎస్ సంస్థ రూ.536 కోట్ల అంచనా వ్యయంతో ఏడాదిన్నర క్రితం పనులు ప్రారంభించింది. ప్రస్తుతం ఫోర్‌బే జలాశయం నుంచి జలవిద్యుత్ కేంద్రానికి నీరు రావడానికి ఒక పైప్‌లైన్ ఉంది. కొత్తగా నిర్మించే రెండు యూనిట్లు (5,6) కోసం పెన్‌స్టాక్ పైపులు నిర్మాణం దాదాపుగా పూర్తికావచ్చింది. తయారైన పైపులను టెస్టింగ్ చేసి పవర్ హౌస్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- వాల్వ్ హౌస్ నుంచి పవర్ హౌస్ వరకు పెన్‌స్టాక్ పైప్‌లైను వేసే ప్రాంతంలో కాంక్రీట్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పవర్‌హౌస్‌లో కూడా ఐదు,ఆరు యూనిట్లు నిర్మించే ప్రాంతంలో టన్నెల్‌తో పాటు కాంక్రీట్ పనులు ఊపందుకున్నాయి. ఇవి రెండు పూర్తయ్యే అవకాశం ఉందని జెన్‌కో అధికారులు చెబుతున్నారు.
- డొంకరాయి నుంచి పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి సంబంధించి ఫోర్‌బై డ్యామ్ 14 కిలోమీటర్ల పొడవునా కెనాల్ ఉంది. ఆరు యూనిట్లు పూర్తిస్థాయిలో పనిచేయాలంటే ప్రస్తుతం కెనాల్ సామర్థ్యం పెంచాలి. లేదంటే ఫోర్‌బై డ్యామ్‌కు అదనంగా ప్రత్యేక పైపులైన్ ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. దీనిపై గతంలో జెన్‌కో అధికారులు సర్వే చేశారు. ఇది కొలిక్కి రావాల్సి ఉంది.



టన్నెల్ పనులను పరిశీలిస్తున్న సీఈ శ్రీధర్

త్వరితంగా పూర్తికి కృషి



పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో కొత్త యూనిట్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. పూర్తిస్థాయి పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. పెన్‌స్టాక్ పైప్‌లైన్లు వేసే పైపుల వెల్డింగ్ పనులు నెల రోజుల్లో పూర్తవుతాయి. అండర్ టన్నెల్ పనులు వేగవంతం చేశాం.

–బి.శ్రీధర్, సీఈ, ఏపీ జెన్‌కో, మోతుగూడెం

సీఎం పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు



చౌడుపల్లిలో నిర్మిస్తున్న హెలిప్యాడ్

అధికార యంత్రాంగం నిమగ్నం



చింతపల్లిలో ఏర్పాటుచేస్తున్న సభా వేదిక

చింతపల్లి రూరల్: చింతపల్లిలో ఈ నెల 21న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి సోమవారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. చౌడుపల్లిలో హెలిప్యాడ్, డిగ్రీ కళాశాల మైదానంలో సభా వేదిక ఏర్పాటు పనులను వేగవంతం చేశారు. విద్యార్థులకు సీఎం ట్యాబ్‌లు అందజేయనున్న గిరిజన సంక్షేమశాఖ బాలురు ఆశ్రమ పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. వీటిని కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. బోధన గురించి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అధికారులతో సమావేశం నిర్వహించారు.ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమష్టిగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. శాఖల వారీగా బాధ్యతలను అప్పగించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, డీపీవో కొండలరావు,పీడీఆర్‌డీఏ మురళి, గిరిజన సంక్షేమశాఖ ఈఈ రాజు, డీఎల్పీవో కుమార్, ఎంపీడీవో ఆశాజ్యోతి, తహసీల్దార్ లత్సాపాత్రుడు, ఏటీడబ్ల్యూవో నాగలక్ష్మి, ఎంఈవోలు ప్రసాద్, నాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ నేతలు, శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



ముస్తాబవుతున్న పాఠశాల ప్రాంగణం



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు

- ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర
- అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ ప్రారంభం



అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న సుభద్ర, చిత్రంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పేర్కొన్నారు. సోమవారం ఆమె స్థానిక ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణతో కలిసి అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తెస్తుందన్నారు. దీనిలో భాగంగానే అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్‌ను ఏర్పాటుచేసిందన్నారు. గతంలో ఆస్పత్రుల్లో రక్త పరీక్షలు మాత్రమే నిర్వహించేవారన్నారు. ప్రస్తుతం అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో ప్రతీ ఒక్కరికి ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం రూ.25 లక్షల వరకు చెల్లిస్తుందన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో గర్భిణులు స్కానింగ్ కోసం పాడేరులోని జిల్లా ఆస్పత్రికి వెళ్లేవారని, ఇప్పుడు హుకుంపేట ఆస్పత్రిలో స్కానింగ్ సేవలు పొందవచ్చన్నారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ప్రాథమిక కేంద్రాల్లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీడీవో వెంకటరావు, వైద్యాధికారులు గాయత్రి, ఈవోపీఆర్డీ అప్పలరాజు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమం జగనన్న లక్ష్యం

ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు: రాష్ట్రంలో ఇంటింటా సంక్షేమం అందించడం జగనన్న లక్ష్యని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. సోమవారం మండలంలోని సుజనకోట గ్రామ సచివాలయంలో నిర్వహించిన పల్లెకు పోదాం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ఆమె వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో సంక్షేమపథంలో దూసుకుపోతుందన్నారు. అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. నాడు నేడు పథకంలో పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారన్నారు. వైస్‌ఎంపీపీ భాగ్యవతి, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు మల్లికార్జున్, సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ స్పందనకు 38 వినతులు



రంపచోడవరం ఐటీడీఏ స్పందనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏపీవో శ్రీనివాసరావు

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 38 వినతులు స్వీకరించినట్టు ఏపీవో (జనరల్) సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్ రాజ్, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఇంచార్జ్ ఏడీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష,, ట్రైనింగ్ డీటీడబ్ల్యూవో తేజస్విని, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారులు జి. డేవిడ్‌రాజ్, ఎండీ యూసఫ్, సుబ్బయ్య, పీహెచ్‌వో చిట్టిబాబు, ఏడీఏ సీహెచ్‌కేవీ చౌదరి, సీడీపీవో సంధ్యారాణి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, రాజేంద్రబాబు, మల్లికార్జునరావు, రామచంద్రమూర్తి, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి శ్రీమతి మడకం సావిత్రి పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- ప్రజలకు మెరుగైన వైద్యసేవలందిస్తున్న వై రామవరం మండలం గుర్తేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి జగదీష్ నాయక్‌కు ఈ ప్రాంతంలో కొంతకాలం కొనసాగించాలని గుర్తేడు గ్రామానికి చెందిన జి.కృపావతి, దూడ, రాజేశ్వరి, టి. పరమేశ్వరి వినతిపత్రం అందజేశారు.
- రంపచోడవరం డివిజన్లోని దివ్యాంగులు పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు పాడేరు వెళ్లాల్సి వస్తోందని, రంపచోడవరంలో ఆన్‌లైన్ సౌకర్యం కల్పించాలని ఎస్.దొరబాబు, బి. లింగేశ్వరరావు, కొమరం శ్రీనివాసదొర, సీబీఆర్ కోఆర్డినేటర్ మధుకుమార్, కె. వరలక్ష్మి దరఖాస్తు సమర్పించారు. – రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తన భర్త మడి కృష్ణకు సంబంధించి వైఎస్సార్ బీమా మంజూరు చేయాలని మారేడుమిల్లి మండలం డీవీ కోటకు చెందిన మడి వీర వెంకట లక్ష్మి వినతిపత్రం అందజేశారు.
- జడేరు నుంచి ఈ.రామవరం వరకు రహదారి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, ఈ నిర్మాణాన్ని ఇద్దరు వ్యక్తులు అడ్డుకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని గంగవరం మండలం ఎండపల్లి సర్పంచ్ బి. రామలక్ష్మి ఫిర్యాదు చేశారు.

ఘనంగా కావడి ఉత్సవం



సీలేరులో కావడి ఉత్సవంలో భక్తులు

సీలేరు: స్థానిక మన్యం శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయంలో స్కంధ సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా ఆలయంలో వల్లీ సుబ్రహ్మణ్య స్వామి వారికి పంచామృత అభిషే కాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం చిన్నారులతో గ్రామంలో కావడి ఉత్సవాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటుచేశారు. ఆంజనేయ స్వామి దేవస్థానంలో సుబ్రహ్మణ్య స్వామికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్‌కు ఎస్ కోటలో హాల్ట్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఇచ్చిన హామీ మేరకు కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్‌కు శృంగవరపుకోటలో హాల్ట్‌ను కేటాయించేందుకు రైల్వే శాఖ సిద్ధమైంది. ఈ రైలు ఇరువైపులా రెండు నిమిషాలు ఎస్ కోటలో ఆగుతుంది. ఈ నెల 19వ తేదీ నుంచి విశాఖపట్నం–కిరండూల్(18514)నైట్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజు రాత్రి 10.08 గంటలకు ఎస్ కోట చేరుకుని అక్కడ నుంచి 10.10 గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 19వ తేదీన కిరండూల్–విశాఖపట్నం(18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఎస్ కోటకు మధ్యరాత్రి(20వ తేదీ) 12.50 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి 12.52 గంటలకు బయల్దేరుతుంది.

శారదా పీఠంలో సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి హారతి అందజేస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

పెందుర్తి: విశాఖ శ్రీ శారదా పీఠంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున భక్తులు పీఠానికి తరలివచ్చారు. సంప్రదాయం ప్రకారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రీతికరమైన పాలకావిడిని ఊరేగించారు. అనంతరం పీఠంలో కొలువుదీరిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి అభిషేకం నిర్వహించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి తన స్వామికి హారతిలిచ్చి పూజలు నిర్వహించారు. అలాగే వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు



అరెస్టు చేసిన గంజాయి నిందితులతో మోతుగూడెం పోలీసులు

మోతుగూడెం: గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. చదలవాడ పంచాయతీ లక్కవరం జంక్షన్ వద్ద సోమవారం గంజాయి తరలిస్తున్న చింతూరు గ్రామానికి చెందిన షేక్‌అలీ, కారం మనోజ్‌కుమార్, మహారాష్ట్రకు చెందిన ముర్తాజ్‌షేక్‌లను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ గోపాలరావు తెలిపారు. మరో నిందితుడు పరారైనట్టు ఆయన చెప్పారు. నిందితుల నుంచి 30 కిలోల గంజాయి, రూ.30 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పరారైన నిందితుడు ఒడిశా ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించామని, త్వరలో పట్టుకుంటామని ఎస్‌ఐ చెప్పారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేదలకు వరం

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- కార్డుల ఆవిష్కరణ



వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను ఆవిష్కరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, డీఆర్వో అంబేద్కర్



ఆరోగ్యశ్రీ బ్రోచర్లను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: పేదప్రజలకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం గొప్ప వరమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ఆరోగ్యశ్రీ అవగాహన కార్యక్రమంతో పాటు కొత్తగా మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డులను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని స్థానిక కలెక్టరేట్ నుంచి అరకు ఎమ్మెల్యేతో పాటు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, లబ్ధిదారులు వీక్షించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ ద్వారా రాష్ట్రంలో అమలుజేస్తున్న ఉన్నత వైద్యసేవలను వివరించారు. అనంతరం జిల్లాకు కొత్తగా మంజూరైన 1500 ఆరోగ్యశ్రీ కార్డులను అరకు ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు సకాలంలో ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా ఆరోగ్యశ్రీ ద్వారా అందిస్తుందన్నారు. పేదలకు ఆరోగ్య శ్రీ ద్వారా మరింత ఉన్నత వైద్యసేవలు అందించేందుకు గాను రూ.25 లక్షలకు ఆరోగ్యశ్రీ పరిమితి పెంచడం సంతోషంగా ఉందన్నారు.డీఆర్వో అంబేద్కర్,డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, జిల్లా టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, డీసీహెచ్ డాక్టర్ కె.కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ పాల్గొన్నారు. ఇలావుండగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్సుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ చింతపల్లి మండలం చౌడుపల్లి గ్రామ సచివాలయం నుంచి హాజరయ్యారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం జగనన్న చలవే

గూడెంకొత్తవీధి: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందేలా సేవలను చేరువచేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో ఉచిత వైద్యం రూ.25 లక్షలకు పెంపు ప్రారంభ కార్యక్రమాన్ని సోమవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు ఆరోగ్యశ్రీని మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసి ప్రజలకు దేవుడయ్యాడన్నారు. ఇప్పుడు అతని తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి అదే పథకంతో ప్రజలకు చేరువ అయ్యారన్నారు. అప్‌డేట్‌చేసిన ఆరోగ్యశ్రీ కార్డులను వలంటీర్లతో పంపిణీ చేయించనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, జెడ్పీటీసీ శివరత్నం, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు గిరిజన విద్యార్థులు



ఎంపికైన విద్యార్థిని సుబ్బలక్ష్మితో ఉపాధ్యాయులు

డుంబ్రిగుడ: జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని కిల్లోగుడ బాలికల ఆశ్రమ పాఠశాల(ఇంగ్లీష్ మీడియం)లో 10వ తరగతి చదువుకుంటున్న విద్యార్థి కొర్రా సుబ్బలక్ష్మి ఎంపికైనట్టు ఆ హెచ్ఎం కళావతి, ఫిజికల్ డైరెక్టర్ కమల సోమవారం తెలిపారు.ఈ నెల 11నుంచి14 వరకు దళోస్టేడియం పల్లనాడు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-17 బాలికల అథ్లెటిక్స్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉమడి జిల్లా విశాఖపట్నం తరపున ఆడి షాట్‌పుట్‌లో బ్రౌంజ్ మెడల్ సాధించింది. డిస్కోత్రోలో సిల్వర్ మెడల్ సాధించి బీహర్‌లో జరగనున్న నేసనల్ స్థాయి పోటీల్లో ఎంపికైన్నట్టు వారు తెలిపారు. జరిగే గేమ్స్‌లో పాల్గొంటుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

ద్విచక్ర వాహనాలకు నిప్పు



దగ్ధమైన వాహనాలను పరిశీలిస్తున్న సర్పంచ్

అరకులోయ రూరల్: సుంకరమెట్ట పంచాయతీ దుక్కగూడ గ్రామంలో అజిత్‌కుమార్‌కు చెందిన స్కూటీ, శోబొయి రాజుకు చెందిన బైక్‌పై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వరిగడ్డి వేసి నిప్పు అంటించడంతో పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం తెలుసుకున్న సర్పంచ్ చిన్నబాబు సోమవారం సంఘటన స్థలానికి వెళ్లి, బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్టు చెప్పారు.

రైతు బాంధవులు



ఆర్ఏఆర్ఎస్ పరిశోధన కేంద్రం

- పరిశోధనలతో అండగా ఉన్న ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు
- జన్యు శాస్త్రంలో 21 రకాల చెరకు, 15 రకాల వరి వంగడాల అభివృద్ధి
- నూతనంగా రూ.3.7 కోట్లతో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు
- 73 వేల ఎకరాలకు నూతన వరి వంగడాలు
- గత ఐదేళ్లుగా ద్రవ రూప జీవన్ ఎరువుల సరఫరా
- నేడు ఆర్ఏఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



చెరకు పంటను పరిశీలిస్తున్న ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త (ఫైల్)



మోడరన్ జాగరి ప్లాంట్

సాక్షి, అనకాపల్లి: అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్) ప్రగతి పథంలో దూసుకుపోతోంది. పలు విలువైన పరిశోధనలతో రైతు బాంధవిగా ఆర్ఏఆర్ఎస్ నిలుస్తోంది. ఇక్కడి శాస్త్రవేత్తలు నిరంతరం రైతుకు అండగా నిలుస్తున్నారు. వ్యవసాయ వంగడాలను అభివృద్ధి చేయడం ,, సేంద్రియ సాగుకు సరికొత్త విధానాలు తీసుకు రావడం, చెరకు నుంచి బెల్లం తయారీ, బెల్లం ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతులు చేయడం వంటి వినూత్న విధానాలకు శ్రీకారం చుట్టారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల రైతులపై తుపాన్లు, అధిక వర్షాల ప్రభావం ఎంత మేర ఉంటుంది.. అప్పుడు పంటలను ఎలా కాపాడుకోవాలి తదితర విశేషాలను వివిధ మాధ్యమాల ద్వారా రైతులకు వివరిస్తున్నారు. 1913లో ప్రారంభమైన ఆర్ఏఆర్ఎస్ నేటికి 110 ఏళ్ల పూర్తి చేసుకుంది. ఇది సుమారుగా 103 ఎకరాల్లో విస్తరించి ఉంది. అందులో 77 ఎకరాల్లో పంటల సాగు, పరిశోధనలు చేపడుతున్నారు. ఇది 1966 ఏడాది జూలై 1 నుంచి ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పనిచేస్తోంది.

నూతన వంగడాల అభివృద్ధి

ఇక్కడ శాస్త్రవేత్తలు జన్యు శాస్త్రంలో 21 రకాల చెరకు, 15 రకాలకు పైగా వరి వంగడాలు అభివృద్ధి చేశారు. గత ఏడాది సుమారు 155 టన్నుల వరకు మేలైన చెరకు వంగడాలను స్థానిక రైతులకు, పంచదార కర్మాగారాలకు అందించారు. అంతేకాకుండా ఒడిశా, తమిళనాడు లాంటి పొరుగు రాష్ట్రాలకు కూడా సరఫరా చేస్తున్నారు. వీటిలో ప్రధానమైనవి మధు, విశ్వామిత్ర, శారద, విశాఖ, కనకమహాలక్ష్మి, ఉత్తర, రేవతి, సింహాద్రి, శ్రీముఖి, వశిష్ట, నవీన్ వంటి వంగడాలు కాగా.. ఇటీవలే చెరకులో మంచి రస నాణ్యత కలిగి ఎరకుళ్ళు, కాటుక తెగులు రాకుండా ఉండేలా.. మన ప్రాంతాలకు అనువుగా ఉండి.. హెక్టారుకు 130 టన్నుల దిగుబడినిచ్చే 'అరుంధతి (2012ఏ 319)' అనే కొత్త వంగడాన్ని అభివృద్ధి చేశారు. కొత్తగా అభివృద్ధి చేసిన 2006 ఏ223, 2010 ఏ 229 వంటి రకాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఇవే కాకుండా, వరి పంటలో 406 క్వింటాళ్ల ఫౌండేషన్ వరి విత్తనం 1,350 ఎకరాలకు సరిపడా సరఫరా చేయడం జరిగింది. రాగి పంటలో పోషకాహారాలు ఎక్కువగా ఉన్న 'ఇంద్రావతి' అనే మేలు రకం విత్తనాన్ని 27 క్వింటాళ్ల వరకు 676 ఎకరాలకు సరిపడా విత్తనాన్ని అభివృద్ధి చేసి రైతులకు అందజేశారు.



స్టాల్లో ఆర్ఏఆర్ఎస్‌లో ఉత్పత్తులను వివరిస్తున్న శాస్త్రవేత్త జగన్నాథరావు (ఫైల్)

జీవన ఎరువుల తయారీ కేంద్రాలు

రైతుకు తక్కువ ఖర్చుతో పాటు అధిక దిగుబడిని కలిగించే విధంగా జీవన ఎరువుల తయారీ కేంద్రాలను ఆర్ఏఆర్ఎస్ ఏర్పాటు చేసింది. పొడి, ద్రవ రూప జీవన ఎరువులు తయారీ కేంద్రాలను స్థాపించి అతి తక్కువ ధరలో నేలకు ప్రాణం పోసే జీవన ఎరువులను అన్ని రకాల పంటలకు ఉత్పత్తి చేస్తున్నారు. తక్కువ ఖర్చు..అధిక దిగుబడితో ప్రతీ రైతుకీ వీటిని అందుబాటులోనికి తీసుకురావాలనే ధృడ సంకల్పంతో ఆర్ఏఆర్ఎస్ కృషి చేస్తోంది. ఆర్ఏఆర్ఎస్‌లో ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీ వారు పొడి, ద్రవ రూప జీవన ఎరువుల తయారీ కేంద్రాలు స్థాపించి అతి తక్కువ ధరలో నత్రజని, భాస్వరం, పొటాషియం జీవన ఎరువులను ఉత్పత్తి చేసి రైతులకు అందిస్తున్నారు. గత ఐదేళ్లుగా సుమారు 40,650 కిలోల పొడి జీవన ఎరువులు, 27,500 లీటర్ల ద్రవ రూప జీవన ఎరువులను తయారుచేసి రాష్ట్రవ్యాప్తంగా 75 వేల ఎకరాలకు అందించారు. వీటితో పాటుగా కీటక శాస్త్ర విభాగంలో జీవ నియంత్రణ పద్ధతులపై విస్తృత పరిశోధనలు జరపడం, మొక్కజొన్నలో కత్తెర పురుగును ఈ ప్రాంతంలో మొదటిసారిగా గుర్తించడం, కొబ్బరిలో సర్పిలాకార తెల్ల దోమ పురుగును గుర్తించి నియంత్రణ విధానాలు, జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా ప్రాచుర్యంలోకి తీసుకురావడం వీరి ప్రత్యేకతలు. పంటల్లో చీడపీడలను నివారించేందుకు రసాయనిక పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో పంటలకు మేలు చేసే మందులను అందించారు.



విలువ ఆధారిత ఉత్పత్తులు

రూ.35 వేల విలువైన పూతరేకుల యంత్రం

ఆంధ్ర సంప్రదాయ మిఠాయి వంటకాల్లో పూతరేకులది అగ్రస్థానం. ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు పూతరేకుల తయారీ మెషీన్‌ను రూపొందించారు. సాధారణంగా రోజుకు 650 పూతరేకులను తయారు చేయగలరు. ఈ మిషన్‌తో 1200 వరకు చేయవచ్చు. దీనిని 2016లో ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు తయారు చేశారు. దీని ఖరీదు రూ.35 వేలు. పేటెంట్ హక్కులు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఉన్నాయి. వీరు తయారు చేసిన మెషీన్‌ను పూతరేకుల తయారీలో పేరెన్నికగన్న ఆత్రేయపురంలో కూడా అమ్ముకునే విధంగా శాస్త్రవేత్తలు అనుమతులు పొందారు.

ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు

రూ.3.5 కోట్లతో ఆర్ఏఆర్ఎస్‌లో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేసి వ్యవసాయ ఉత్పత్తులతో పాటు వాటి ఉప ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు, రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. చెరకు ప్రాసెసింగ్ లైన్లు (ఘన బెల్లం, పొడి బెల్లం, బెల్లం ఆధారిత ఉత్పత్తులు, బెల్లం జొన్న బిస్కెట్లు, బెల్లం జెల్లీలు, చెక్కీలు), చిరుధాన్యాల ప్రాసెసింగ్ లైన్లు (చిరుధాన్యాల పిండి, పోషక బార్, మల్టీ మిల్లెట్, చిరుధాన్యాల అటుకులు), పనస ప్రాసెసింగ్ లైన్లు (పనస జామ్, ఉడికించడానికి సిద్ధంగా ఉన్న లేత పనస) వంటివి ఎగుమతి చేస్తున్నారు.

బెల్లం నాణ్యతను పెంచడంలో పరిశోధన చెప్పుకోదగ్గది. ఇవే కాకుండా బెల్లంపై విలువ ఆధారిత పరిశోధనలో వివిధ రూపాల్లో బెల్లాన్ని తయారు చేయడం కనిపెట్టారు. పొడి రూపంలో ఎక్కువ రోజులు నిల్వ ఉండేలా బెల్లాన్ని తయారుచేసే పరిశోధనలు విజయవంతం అయ్యాయి. దేశంలోనే రెండో అధునాతన బెల్లం తయారీ ప్లాంటుగా 'నవీన బెల్లం ప్లాంటు'ను అభివృద్ధి చేశారు. ఇక్కడ రోజుకు టన్ను బెల్లాన్ని, 1500 లీటర్ల బెల్లం పాకాన్ని, 800 కిలోల బెల్లం పొడిని తయారు చేయవచ్చు. అంతేకాకుండా బెల్లం రసంలో అల్లం, నిమ్మ రసం కలిపి పొడరు తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

రైతు బాంధవులం..

పంటల యాజమాన్య విభాగంలో అధిక దిగుబడులు సాధించడానికి కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నాం. ఇటీవల మిచాంగ్ తుపాను కారణంగా వర్షాలు కురిసినప్పుడు మా శాస్త్రవేత్తల బృందం పంటను రక్షించుకునేలా అవగాహన కల్పించింది. ఒకవైపు రైతుకు అండగా ఉంటూ.. మరోవైపు తన పరిశోధనలతో దేశ విదేశాల్లో ఆర్ఏఆర్ఎస్ పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చింది. రైతులకు యంత్రాలను రూపొందించి అద్దెకు ఇవ్వడం, బెల్లం, మిల్లెట్ ఆధారిత ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేస్తూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నాం.

–పి.వి.కె జగన్నాథరావు, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త

మందుల పేరుతో వచ్చి.. పుస్తెలతాడు అపహరణ

మల్కాపురం: నమస్తే మేడం..డాక్టర్ గారూ మందుల కోసం ఇంటికి రమ్మన్నారు..అని నమ్మించిన ఓ వ్యక్తి సదరు డాక్టర్ భార్య మెడలో బంగారు పుస్తెలతాడు అపహరించుకుపోయాడు. షాక్‌కు గురైన ఆమె కేకలు వేయడంతో అప్పటికే దొంగ పరారయ్యాడు. మల్కాపురం క్రైమ్ ఎస్.ఐ పల్లా శంకర్‌యాదవ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 60వ వార్డులో పరిధిలోని గుల్లలపాలెం వుడా కాలనీ వద్ద కేవీఎల్ నర్సింగరావు అనే వైద్యుడు భార్య జానికితో కలిసి ఉంటున్నాడు. ఇంటికి సమీపంలో ప్రతిభ నర్సింగ్ హోం ఆస్పత్రి పెట్టి రోజూ ఉదయం, సాయంత్రం వైద్య సేవలందిస్తున్నాడు. సోమవారం సాయంత్రం నర్సింగరావు క్లినిక్‌కు వెళ్లిపోయాడు. ఇది గమనించి గుర్తు తెలియని వ్యక్తి..వైద్యుడు ఉంటున్న ఇంటికి వచ్చి తలుపు కొట్టాడు. డాక్టర్ భార్య జానకి తలుపు తీసి ఎవరు మీరు అని ప్రశ్నించగా...డాక్టర్ గారు తనను ఇంటికి రమ్మన్నారని, ఉదయం ఆస్పత్రికి వెళ్తే మందులు కొన్ని ఇచ్చారని, మరి కొన్ని ఇంటి వద్ద ఉన్నాయి.. సాయంత్రం వచ్చి తీసుకోమన్నారని నమ్మబలికాడు. డాక్టర్‌గారు క్లినిక్‌లో ఉన్నారు.. అక్కడకు వెళ్లండి అని జానకి బదులిచ్చింది. మాట్లాడుతూనే ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల పుస్తెలతాడు తెంపి పారిపోయాడు. ఆమె తేరుకుని కేకలు వేసేసరికే దొంగ పారిపోయాడు. క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ఘటన స్థలానికి వచ్చి బాధితురాలు నుంచి వివరాలను సేకరించారు. దొంగ ఆనవాలను తెలుసుకున్నారు. అక్కడ సీసీ కెమెరాలను పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శంకర్‌యాదవ్ తెలిపారు.

తెప్ప బోల్తా పడి మత్స్యకారుడి మృతి



తెప్ప బోల్తా పడి మృతి చెందిన మత్స్యకారుడు నూకరాజు

ఎస్.రాయవరం : రేవుపోలవరం తీరంలో సముద్రంలోనికి చేపల వేటకు వెళ్లే సమయంలో కెరటాలకు తెప్ప బోల్తాపడి మత్స్యకారుడు మృతి చెందాడు. ఘటనపై తోటి మత్స్యకారులు అందించిన సమాచారం మేరకు వివరాలివి. కొత్త రేవుపోలవరం గ్రామానికి చెందిన బొడ్డు నూకరాజు(50), చోడిపల్లి తాతీయ్యలు, దానయ్య, కోరాడ నాగరాజు కలిసి తెప్పపై తెల్లవారు జామున చేపల వేటకు వెళ్లారు. తీరంలోనికి వెళ్లే సమయంలో కెరటాల తాకిడికి తెప్ప బోల్తా పడడంతో నూకరాజు నీటిలో మునిగిపోయాడన్నారు. తోటి మత్స్యకారులు అతడిని బయటకు తీసేందుకు ప్రయత్నించినా అప్పటికే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందడంతో ఎస్.రాయవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

పొక్లెయిన్‌కు నిప్పంటించిన దుండగులు

మునగపాక : పాటిపల్లి మోడల్ స్కూల్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి పొక్లెయిన్‌కు నిప్పంటించారు. దీంతో రూ.2 కోట్లకు పైగా నష్టం సంభవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. మోడల్ స్కూల్ సమీపంలో ప్రభుత్వ అనుమతితో వ్యాపారులు గ్రావెల్ తవ్వకాలను ఇటీవల ప్రారంభించారు. ఏం జరిగిందో తెలియదు పొక్లెయిన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి పెట్రోల్ పోసి తగులబెట్టారు. విషయం తెలుసుకున్న యలమంచిలి సీఐ గఫూర్, ఎస్ఐ మహమ్మద్ ఆలీ సంఘటనా స్థలానికి సోమవారం చేరుకొని కాలిపోయిన పొక్లెయిన్‌ను పరిశీలించారు. అలాగే క్లూస్ టీమ్‌ను కూడా రప్పించి వివరాలు సేకరిస్తున్నారు.

నేషనల్ బాక్సింగ్ పోటీలకు కృష్ణవేణి



నర్సీపట్నం : ఈ నెల 21 నుండి 26 వరకు ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న 7వ సీనియర్ నేషనల్ బాక్సింగ్ పోటీలకు ఏపీ జట్టు తరపున నర్సీపట్నానికి చెందిన కోలుకుల కృష్ణవేణి ఎంపికైంది. 66 కిలోల సీనియర్ విభాగం ఉమెన్ కేటగిరిలో ఆమె పోటీల్లో పాల్గొనుంది. ఇటీవల విశాఖలో జరిగిన సీనియర్ స్టేట్ బాక్సింగ్ పోటీల్లో కృష్ణవేణి గోల్డ్‌మెడల్ సాధించి, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిందని కోచ్ అబ్బు తెలిపారు. కృష్ణవేణిని పలువురు అభినందించారు.

కాంట్రాక్టు కార్మికుల నిరసన

సీలేరు: యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్స్ ఎంప్లాయీస్ యూనియన్ స్టేట్ కమిటీ పిలుపు మేరకు సీలేరులో సోమవారం ఏపీ జెన్‌కో సర్కిల్ ఆఫీసు వద్ద భారీ ఎత్తున కాంట్రాక్టు కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో సీలేరు బ్రాంచ్ యూనియన్ ప్రెసిడెంట్ బి.లక్ష్మణరావు వమాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని , పీస్ వర్క్ లేబరుకు మ్యాన్ పవర్ ఇవ్వాలని ,తెలంగాణ తరహాలో కాంట్రాక్ట్ కార్మికులందరికి డైరెక్ట్ పేమెంట్ ఇవ్వాలన్నారు. సీలేరు మార్కెట్ నుంచి ఎపిజెన్‌కో ఎస్ఈ ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహించారు. లక్ష్మణరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు



సారే ఊరేగిస్తున్న మహిళా భక్తులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు పెరుగుబజార్ జంక్షన్ కుంచావారి గౌరీపరమేశ్వరుల అమ్మవారి సారె ఊరేగింపు సోమవారం ఘనంగా జరిగింది. పట్టణంలో వీధులు గుండా ఊరేగింపు నిర్వహించి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.అబ్బులు మాట్లాడుతూ సుమారు 200 సంవత్సరాల చరిత్ర కలిగిన కుంచావారి గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని ఈనెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆదేరోజు ఉదయం పట్టణం వీధుల్లో అమ్మవారి విగ్రహ ఊరేగింపు, సాయంత్రం నేలవేషాలు, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

సమావేశంలో వెల్లువెత్తిన సమస్యలు

రాజవొమ్మంగి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన సోమవారం జరిగింది. కార్యక్రమంలో పలు సమస్యలను సభ్యులు ప్రస్తావించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ కుళాయి పనులపై పలువురు సభ్యులు ప్రశ్నలు అడిగారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సీతారాం నాయక్ మాట్లాడుతూ రూ. 6.80 కోట్ల వ్యయంతో 30 జేజేఎం పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని, అగ్రిమెంట్ పూర్తికాగానే పనులు మొదలవుతాయన్నారు. కాగా రూ. 7.76 కోట్ల వ్యయంతో మరో 26 రక్షిత మంచినీటి పథకాలు మంజూరు కాగా ఆయా పనులను వెలుగు మహిళా శక్తి సంఘాలకు అప్పగిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. మూడు దఫాలుగా మైనర్ ఇరిగేషన్ అధికారులు సర్వసభ్య సమావేశాలకు గైర్హాజరువుతున్నాయని, పంట కాలువల సమస్యల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు సభ్యులు చెప్పారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి మరోసారి తీసుకొని వెళతానని ఎంపీపీ వెంకటలక్ష్మి చెప్పారు. వట్టిగెడ్డ రిజర్వాయర్ పంటకాలువ గట్టు ఆక్రమణకు గురైనట్టు తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి దృష్టికి తెచ్చారు. ఆయన స్పందించి పక్కాగా కొలతలు తీసి కాలువ గట్ల సరిహద్దు తెలియజేస్తామన్నారు. లోతట్టు గ్రామాలైన బూరుగపల్లి, వయ్యేడు గ్రామాలకు రోడ్డు మంజూరైనా ఫారెస్టు శాఖ క్లియరెన్స్ లేక పనులు నిలిచిపోయాయన్నారు. మండలంలో రూ. 10.50 కోట్లతో మండలానికి 17 కిలో మీటర్ల మేర 6 బీటీ రోడ్లు మంజూరయ్యాయని, సగం పనులు పూర్తయినట్లు ఎంపీపీ గోము వెంకటలక్ష్మి వెల్లడించారు. ఈ రహదారుల నిర్మాణం వల్ల అనేక గ్రామాలకు రహదారి రవాణా సదుపాయాలు మెరుగుపడనున్నాయన్నారు. ఎంపీడీఓ యాదగిరీశ్వరరావు, వైస్ ఎంపీపీ జుర్రా రాజేశ్వరి పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల విజేత భాస్కర్



విజేత జి.భాస్కర్‌కు మెమెంటో, నగదు, అందజేస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి: క్రీడల్లో నేటి ఓటమి రేపటి గెలుపుకు నాంది పలుకుతుందని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక గవరపాలెం వి.వి.రమణరైతు భారతి ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్‌పోటీలు(మిస్టర్ ఆంధ్రా-2023) ముగింపు కార్యక్రమం ఆదివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉమ్మడి జిల్లా క్రీడలకు పుట్టినిల్లు అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకోటలో వేలాది మంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అనంతరం మిస్టర్ ఆంధ్ర-2023 విజేతగా విశాఖకు చెందిన జి.భాస్కర్‌కు, రన్నర్‌గా కర్నూలుకు చెందిన కె.సుధీర్‌కు రూ. 25వేలు, 10వేలు నగదు ప్రోత్సాహం, మెమెంటో, సర్టిఫికెట్‌ను రత్నాకర్ అందజేశారు. అంతకు ముందు నేషనల్ బాడీ బిల్డర్ శిలపరశెట్టి బాబీని రత్నాకర్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఒలింపిక్ క్రీడాకారుడు మాణిక్యాలు, 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల బాస్కర్, ఎస్‌డీ గ్రూప్ అధినేత కాంద్రేగుల శ్రీరామ్, వ్యాపారవేత్తలు ముప్పన సుబ్రహ్మణ్యం, విల్లూరి శ్రీనివాసరావు, అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు అమరపల్లి కృష్ణాజీ, సభ్యులు కాంద్రేగుల అజయ్, దొడ్డి సంతోష్, మళ్ల రామచంద్రరావు, వివిధ జిల్లాల బాడీబిల్డర్స్ పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో సత్తాచాటిన రామ్



రజత పతకం సాధించిన మర్రా రామ్

నర్సీపట్నం : అనకాపల్లి బాడీ బిల్డర్స్, ఫిట్నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న అనకాపల్లి వి.వి.రమణ రైతు భారతి ఆడిటోరియంలో ఏపీ 6వ బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నర్సీపట్నానికి చెందిన మర్రా రామ్‌కీ పాల్గొని, 55 కేజీల విభాగంలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మోడల్ సాధించాడు. అద్భుతమైన ప్రతిభ కనబరిచిన రామ్‌కి పలువురు అభినందనలు తెలియజేసారు.

ఇంటర్ వర్సిటీ ఖోఖో పోటీలకు ఎంపిక



బి.అలేఖ్య, బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని

అనకాపల్లి : స్థానిక డైట్ కళాశాల విద్యార్థిని బి.అలేఖ్య(బీటెక్ ద్వితీయ సంవత్సరం) ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకూ చెన్నైయి సెంట్రల్ యూనివర్సిటీలో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక జాతీయ రహదారి కళాశాలలో అలేఖ్యను సోమవారం అభినందించి మాట్లాడారు. ఈనెల 16, 17 తేదీల్లో జెఎన్‌టీయూ విజయనగరంలో జరిగిన అంతర్ కళాశాలల ఖోఖో పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి, అంతర్ విశ్వ విద్యాలయాల పోటీలకు ఎంపికై నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, ఫిజికల్ డైరెక్టర్ బీహెచ్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.